# జగమే సాయి మయం

(సంగీత నృత్య నాటకం)

పాట

పల్లవి : సత్యసాయి జననీ ప్రేమామృతదాయినీ
నీ ప్రేమ వైభవం నయనోత్సవం
మా మనసులు పరవశించు బ్రహ్మోత్సవం ॥సత్య॥

చ.1 : ఏ పూర్వ పుణ్యమో నీ ఒడిలో చేరాము
కన్నతల్లి ప్రేమలో కరగిపోయాము
ఏ దివ్య వరమో నీ చేయి పట్టి నడిచాము
సాయి ప్రేమబాటలో తొలి అడుగులు వేశాము
శాంతిదాయినీ నీకు వందనం
విశ్వమోహినీ నీకు పాదాభివందనం ॥సత్య॥

చ.2 : నీ మాటే మంత్రము మాకు ప్రాణము
నీ చూపే ఛత్రము మాకు అభయము
నీ ప్రేమవాహినిలో పులకించిపోయాము
నీవే మా తల్లితండ్రి గురుదైవము
శాంతిదాయినీ నీకు వందనం
విశ్వమోహినీ నీకు పాదాభివందనం ॥సత్య॥

వరహాలు : సుందరం! నీకు ధన్యవాదాలు చెప్పుకోవాలయ్యా. మారుమూల వున్న ఈ గ్రామంలో త్రాగడానికి మంచినీరు లేదు. సరైన వైద్యం అందక గ్రామస్తులు రోగాల పాలవుతున్నారు. పోనీ, పట్నానికి పోదామంటే సరైన రోడ్ లేదు. ఈ గ్రామం ఏమవుతుందో అని భయపడుతున్న సమయంలో మీరు వెలుగు రవ్వల్లా మా గ్రామంలో అడుగు పెట్టారు. మా గ్రామం బాగు పడుతుందనే ఆశ చిగురించిందయ్యా!

సుందరం : కృతజ్ఞతలు మాకు కాదు, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారికి చెప్పండి. పల్లెలే భారతదేశానికి ఆయువుపట్టని, పల్లెల ప్రగతిలోనే దేశ ప్రగతి ఇమిడి వుందని మా బాబా చెప్పారు. “గ్రామ సేవయే రామ సేవ”ని, “పల్లె సేవయే పరమాత్ముని సేవ”ని ప్రభోదించారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. మీ గ్రామం బాగుపడుతోందంటే అది వారి ఆశీస్సే.

| | |
|---|---|
| వరహాలు : | అవతార పురుషుడే మా గురించి పట్టించుకున్నారంటే మేమెంత అదృష్టవంతులమో! |
| సుందరం : | గ్రామ అవసరాలే కాదు వరహాలుగారూ! కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత, పెద్దల పట్ల గౌరవం, యువకులలో స్నేహభావం, నిరాధారులైన వృద్ధుల పోషణ ఇలా అన్ని విషయాలపై శ్రద్ధ వహించాలని మా బాబా చెప్పారు. మీ అందరి సహకారంతో ఈ కార్యక్రమాలన్నీ చేపట్టి ఈ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా రూపొందించుకుందాం. |
| వరహాలు : | సాయి సేవకులకంటే మాకు ఆత్మీయులెవరు సుందరం? మీతో చేయి చేయి కలిపి సేవ చేస్తాము. |
| సుందరం : | తాతయ్యా, ఊరికెళ్తున్నారా? |
| వృద్ధుడు : | కాదు బాబు, ఊరు వదిలి వెళ్ళిపోతున్నాను. |
| సుందరం : | ఏం? |
| వృద్ధుడు : | పొలం పని చేసి సంపాదించుకునే శక్తి నాకు, అవ్వకి లేదు. మరి మాకు అన్నం ఎవరు పెడతారు బాబూ? అందుకే పట్నం పోతున్నాను. |
| సుందరం : | పట్నంలో ఏం పని చేయగలవు తాతయ్యా ఎక్కడుండగలవు? ఎవరన్నం పెడతారు నీకు? |
| వృద్ధుడు : | పని చేయడానికి నాకు శక్తి లేదు బాబూ. |
| సుందరం : | మరి పట్నంలో ఎలా బ్రతుకుదామని అనుకుంటున్నావు? |
| వృద్ధుడు : | ఏ గుడి మెట్ల దగ్గరో కూర్చొని భిక్షమెత్తుకుంటాను. |
| సుందరం : | ఆ మాటనకు తాతయ్యా. ప్రతి నెలా మీ ఇంటికి శ్రీ సత్యసాయి అన్నపూర్ణ అమృత కలశాన్ని అందిస్తాం. అందులో మీ కుటుంబానికి సరిపోయే బియ్యం, పప్పు అన్నీ వుంటాయి. హాయిగా సాయి నామస్మరణ చేసుకుంటూ నిశ్చింతగా గడపొచ్చు. మీలాంటి వారి యోగక్షేమాలు చూసుకోవడానికే మమ్మల్ని బాబా గ్రామ సేవ చేయమన్నారు. |
| వృద్ధుడు : | బాబా! మమ్మల్ని కన్నతండ్రిలా ఆదుకున్నావా తండ్రీ. |
| రవి : | సుందరం! |
| సుందరం : | ఏం రవీ? |
| రవి : | అమ్మని ఆసుపత్రిలో చేర్చారు మన సాయి యువత. రక్తం అవసరమయితే రక్తదానం కూడా చేశారు. ఇప్పుడు అమ్మ కోలుకుంటున్నాది సుందరం. |
| సుందరం : | చాలా సంతోషం! మీ అమ్మ మా అమ్మ కాదా రవీ! గ్రామంలో యువకులందరితో ఈ రోజే మాట్లాడాను. అందరం కలిసి రేపటినుండే గ్రామానికి రోడ్డు వేసే పని, బావి త్రవ్వే పని మొదలుపెడదాం. |
| రవి : | అలాగే! |
| వరహాలు : | సాయినామంతో మా గ్రామం కలకళలాడుతోంది సుందరం |
| సుందరం : | శీనయ్యా! ఎక్కడికెళుతున్నావయ్యా? |
| శీనయ్య : | పొలానికయ్యా. |
| సుందరం : | నువ్వు పొలానికి వెళ్ళడం లేదని నాకు తెలుసు. అన్నా! పది ఎకరాలకు కామందువు. ఈ రోజు కూలీగా మారిపోయావు. మీ ఇంటి మహాలక్ష్మి చిరిగిన చీరతో గడుపుతోంది. |

రామలక్ష్మణుల్లాంటి నీ పిల్లలు చదువు సంధ్యలు లేక జులాయిగా తిరుగుతున్నారు. ఈ పరిస్థితికి కారణం ఎవరు? నీ మద్యపాన వ్యసనం కాదా?

శీనయ్య : నిజమే తమ్ముడూ, కానీ అ అలవాటు మానలేకపోతున్నాను.

సుందరం : అన్నా! మద్యపానం చేయాలనిపించినప్పుడు నీ భార్య, బిడ్డల్ని తలచుకో, బాబాని ప్రార్థించు. తప్పక నువ్వు బాగుపడతావు.

శీనయ్య : అలాగే తమ్ముడూ

సుందరం : నువ్వు మద్యం మానకపోతే నేను భోజనం మానేస్తాను.

శీనయ్య : ఆ పని చేయకు తమ్ముడూ, నేను తప్పక మానేస్తాగా!

సుందరం : రా! సాయి నామస్మరణం ఏం చేస్తుందో తెలుసుకో.

పాట

పల్లవి : సాయీ నామం మధురమురా తీయని నామం పాడరా
నామం పాడి పరవశమైతే జన్మధన్యమైపోవునురా
జైజై సాయిరాం జైజైసాయిరాం ॥సాయి॥

చ. 1. : సాయినామ సంకీర్తన చేయగ ప్రేమ వెల్లువై పొంగునురా
ప్రేమబాటలో పయనిస్తే సేవాసాధన యోగమురా
నావారని నీవారని ఎంచక అందరినీ ప్రేమించుమురా
ప్రేమా సేవా మదిలో మెదిలే మానవుడే ఇల దైవమురా
జైజై సాయిరాం జైజైసాయిరాం ॥సాయి॥

చ. 2. : కన్నీరొలికే జీవితాలకు సాయి నామమే జీవమురా
చితికిన బ్రతుకుల విధివంచితులకు సాయినామమే తోడురా
సత్యసాయి స్మరణాంచితమైతే ప్రతీ సేవా ఒక యోగమురా
వసుధంతా ఒక కుటుంబమైతే భూతలమే ఒక స్వర్గమురా
జైజై సాయిరాం జైజై సాయిరాం ॥సాయి॥

జగన్నాథం : ఇదిగో వీడే మావాడు సుందరం. ఇంజనీరింగు పాసై ఉద్యోగం సంపాదించుకోరా అంటే గ్రామ సేవలంటూ గ్రామాల వెంట తిరుగుతున్నాడు.

సుందరం : నాన్నగారూ

జగన్నాథం : ఏం తప్పన్నానా? అప్లికేషన్లు పెట్టినంత మాత్రాన ఉద్యోగం ఎవరు ఇస్తార్రా? ఒక రికమండేషన్ ఉత్తరమో, దక్షిణో సమర్పించుకోవాలని చెప్పాను. విన్నావా?

సుందరం : నాన్నగారూ! నా జీవితంలో ఆ పని చేయను. భగవాన్ బాబా వారి పాదాలు పట్టుకున్నాను. నా ప్రతిభ మీద, స్వామి అనుగ్రహం మీద ఆధారపడతాను తప్ప మీరు చెప్పిన మార్గాలలో ఉద్యోగం సంపాదించుకోను.

జగన్నాథం : ఉన్న డబ్బంతా ఖర్చు పెట్టి నువ్వు ఉద్ధరిస్తావని చదివించాను. నీ తమ్ముళ్లని

చదివించాలి. చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి. అమ్మ వ్యాధికి చికిత్స చేయించాలి.

సుందరం : ఆ బాధ్యతల్ని నేను తప్పక నెరవేరుస్తాను.

జగన్నాధం : ఎలా ఆదుకుంటావురా? ఇదండీ వీడి వరుస. ఉద్యోగం లేదు. నే చెప్పిన ప్రయత్నాలు చెయ్యడు. కుటుంబాన్ని ఆదుకుంటానని నీతులు వల్లిస్తాడు. ఇదిగో ఈయన పేరు రంగనాధంగారు. నీకు ఉద్యోగం ఇస్తానని వచ్చారు. కనీసం ఆయన మాటయినా విను.

సుందరం : మా నాన్న ఆవేదన చూసి బాబాయే మిమ్మల్ని పంపించి వుంటారు. చెప్పండి.

జగన్నాధం : సరేలే, ఆయన చెప్పింది విను.

రంగనాధం : సుందరం! సత్యం నిర్మాణ సంస్థకి నేను యజమానిని. వంతెనలు, ఆనకట్టలు నిర్మించిన అనుభవం వుంది నాకు. నిన్ను నా సంస్థలో మంచి ఇంజనీరుగా నియమించాలను కుంటున్నాను.

సుందరం : ధన్యవాదాలు. ఉద్యోగంలో చేరే ముందు కొన్ని విషయాలు మిమ్మల్ని అడగొచ్చా?

రంగనాధం : ఓ యస్ అడగండి.

సుందరం : నేను అబద్ధం ఆడను. తప్పుడు పనులు చేయడానికి ఎవరు లంచం ఎర వేసినా లొంగను. నీతి నిజాయితీలకు నేను ప్రాణం ఇస్తాను. నా పద్ధతి మీకు నచ్చితేనే ఉద్యోగం ఇవ్వండి.

రంగనాధం : అబద్ధం ఆడరా. ఫెంటాస్టిక్. మరి ఉద్యోగం ఎలా చేస్తావయ్యా? మనకు లాభం చేకూరుతుందంటే అబద్ధం ఆడాలి. నష్టాల ఊబిలో పడకుండా ఉండాలంటే ఒక్కొక్కప్పుడు అబద్ధం ఆడి తీరాలి.

సుందరం : కాని అది సత్యసాయి జీవనం విధానం కాదు. సత్యమే నా స్వరూపం అన్నారు మా బాబా. ఎన్ని అగ్ని పరీక్షలు పెట్టినా సత్యాన్ని తప్పని సత్యహరిశ్చంద్రుడ్ని కన్న దేశం మనది. ఆ మహనీయుడు ఎన్ని అవాంతరాలు ఎదురైనా సత్యాన్ని విడిచి పెట్టలేదు.

(సత్య హరిశ్చంద్రుడు భార్యా బిడ్డలతో నక్షత్రకునితో ప్రవేశిస్తాడు)

వ్యక్తి : (పరుగున వచ్చి హరిశ్చంద్రుని పాదాలకు నమస్కరిస్తాడు)
మహారాజా! ఏమిటీ అన్యాయం? సత్యాన్ని ప్రాణప్రదంగా ప్రేమించిన మీకా ఈ దురవస్థ! సత్యవ్రతునిగా ఆచంద్రార్కం కీర్తి సంపాదించుకున్నారు. మీకా ఈ దీనావస్థ? అనుజ్ఞ ఇవ్వండి. ఇప్పుడే వెళ్ళి ఆ విశ్వామిత్రునితో యుద్ధం చేసి ఓడించి మిమ్మల్ని మా మహారాజుగా తిరిగి ప్రతిష్ఠించుకుంటాం.

హరిశ్చంద్రుడు : నాయనా! మీ ప్రేమాభిమానాలను చూరగొన్న నా బ్రతుకు ధన్యం. నన్ను ధర్మ మార్గాన నడవనివ్వండి. ప్రాణం పోయినా అసత్యమాడనన్న నా ప్రతిజ్ఞ పాటించనివ్వండి. పరమేశ్వరుడే ప్రతిఘటించినా నా ప్రతిజ్ఞ విడిచిపెట్టను. నా సత్యవ్రతం నిర్విఘ్నంగా కొనసాగేలా నన్ను ఆశీర్వదించండి.

వ్యక్తి : సత్యాన్ని ఆశ్రయించిన వారిని భగవంతుడే అనుగ్రహిస్తాడు. ఆశీర్వదిస్తాడు.

నక్షత్రకుడు : మహారాజా! నీ ప్రజలు కూడా నీలాగే ఉన్నారు. యథారాజా తథాప్రజా అన్నారు కదా, రాజా మరొక్కమాట చెప్తున్నాను విను. రాజ్యం నీకిస్తానని అనలేదు. నా రాజ్యాన్ని

సింహాసనాన్ని వదిలిపెట్టి వెళ్ళమని విశ్వామిత్రుణ్ణి ఆదేశించు ఈ ఒక్క అసత్యం చెప్పు. ఈ మహారాజభోగాలు ఆనందంగా అనుభవించు. నిరంతరాయంగా రాజ్యాన్ని పాలించు.

హరిశ్చంద్రుడు : బ్రాహ్మణకుమారా! పదవి కోసం, ధనం కోసం, అశాశ్వతమైన రాజ్యం కోసం అసత్యమాడమంటారా.

నక్షత్రకుడు : మహారాణీ చంద్రమతీ! నీ భర్తకు నువ్వైనా నచ్చజెప్పి ఈ కష్టాల కడలిలో నుండి బయటపడు తల్లీ!

చంద్రమతి : బ్రాహ్మణోత్తమా! ధీమంతుడు, సత్య వాక్య పరిపాలకుడు అయిన మహారాజుకు అర్ధాంగినై ఆయన అడుగుజాడల్లో నడవాలి తప్ప సన్మార్గాన్ని వీడమని చెప్పమంటారా? నా కంఠంలో ప్రాణం వుండగా నేను చెప్పను. సత్య వాక్య పరిపాలనలో ఆయనకు చేదోడు వాదోడుగా వుంటాను. అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడను. మమ్మల్ని ఆశీర్వదించండి.

నక్షత్రకుడు : సత్యాన్ని నమ్ముకుంటే సర్వస్వం కోల్పోయి, కడకు నిద్రాహారాలు కరువై, అత్యంత దీనస్థితిలో దుర్భర దారిద్ర్యం కూడా అనుభవించవలసి వస్తుంది. మరొక్కసారి ఆలోచించు, ఒక్క అసత్యం పలుకు.

హరిశ్చంద్రుడు : తమరు సత్యం చెప్పారు. సత్యవాక్య పరిపాలన ఎంత దుస్తరమో ఎన్ని కఠోర శ్రమలకు గురి చేస్తుందో నాకు తెలుసు. ఈశ్వరానుగ్రహం ఎలా వుంటే అలా జరుగుతుంది. ఇది నా దృఢ నిర్ణయం. దీనికి తిరుగులేదు.

నక్షత్రకుడు : భళా హరిశ్చంద్రా! భళా! మీ ఇరువురికీ ఈ నక్షత్రకుని నమోవాకాలు.....

(విరామ సంగీతం)

సుందరం : సత్యం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడ్డాడు హరిశ్చంద్రుడు సూర్యచంద్రులున్నంత వరకూ ఆ రాజన్యుని పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. మానవ జన్మ ఎత్తాక బుద్ధి ఉపయోగించాలి. సన్మార్గంలో నడవాలి. మనం ఎంత ఘనకీర్తి కల దేశంలో పుట్టామో మా స్వామి చెప్పేరు వినండి.

పద్యం : ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్యవీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాలా ప్రఖ్యాతిగాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యలు
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి

భరత భూమియందు జనన మంది
భరత మాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంత మీదె బాలులారా!

రంగనాధం : ఈ కాలంలో కూడా ఈ ధర్మనిష్ఠ పాటించగలమంటారా?

సుందరం : కాలం ఏదైనా మన సంకల్పం బలమైనదైతే ఎటువంటి నీతి నియమాలైన పాటించగలం

రంగనాధం : నాది వ్యాపారం. లాభాలు సంపాదించుకోవడాలనుకోవడం తప్పు కాదు కదా!

సుందరం : లాభం ఆర్జించుకోవడంలో తప్పులేదు. కాని రూపాయి సంపాదించవలసినచోట పది రూపాయలు ఆర్జించుకోవాలన్న దురాశ తప్పు. ఆ దురాశతో నిర్మాణంలో, నాణ్యతకు పటిష్ఠతకు తిలోదకాలివ్వడం ఘోరమైన నేరం. పదికాలాలపాటు ప్రజలకు ప్రయోజనం చేకూర్చనున్న కట్టడాలు ఆదిలోనే గంగపాలయితే దేశద్రోహం కాదా? తల్లి గుండెల్లో చిచ్చుపెట్టడం కాదా?

రంగనాధం : నేను జీతం ఇస్తున్నాను కదా, మరి నా కోసం మీ పట్టుదల ప్రక్కన పెట్టి కాస్త సర్దుకుపోలేరా!

సుందరం : అంటే ఎలాగైనా డబ్బు సంపాదించడమే మీకు ముఖ్యమన్నమాట. దేశానికి, దేశ ప్రజలకి ఎంత నష్టం జరిగినా నేను చూస్తూ ఊరుకోవాలన్న మాట అంతే కదా మీరనేది?

రంగనాధం : స్వార్థం, స్వప్రయోజనం లేకుండా జీవించడానికి నేను మహనీయుడ్ని, మహర్షిని కాను కదా.

సుందరం : నీతి నియమాలు కలిగి వుండటానికి మీరు మహర్షి కానక్కరలేదు. మామూలు మనిషిగా ఉంటే చాలు, నీతి నియమాలు పాటిస్తే మామూలు మనిషి కూడా మహర్షి అవుతాడు అంటారు మా బాబా. స్వామి మాటే నాకు వేదవాక్కు. ఆ స్వామి పాదాలను నమ్ముకున్న నాకు కంఠంలో ప్రాణం వున్నంతవరకూ నీతికై నిలబడతాను. స్వామి మాట పాటించకపోతే, ప్రశాంతి నిలయంలో అడుగు పెట్టడానికీ స్వామిని దర్శించడానికీ అర్హత లేదు.

రంగనాధం : అయితే నాకు ఏ విధంగానూ సహాయం చేయలేనంటారు.

సుందరం : చేస్తాను. ఆహోరాత్రులు కష్టించి పని చేస్తాను. మీ ధనం, సహాయం, వృధా కాకుండా చూస్తాను. మీ సంస్థకూ, మీకూ కీర్తిప్రతిష్టలు సంపాదిస్తాను.

రంగనాధం : అంతేగాని మీ నిర్ణయం మారదంటారు.

సుందరం : నాకు సాయి మాటే మంత్రము. సాయి బాటే రాజబాట. స్వార్థం, స్వప్రయోజనం సత్యసాయి డిక్షనరీలో లేవు. వుండవు. దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ శతమన్యుడి గురించి ఎప్పుడైనా విన్నారా.

(విరామం సంగీతం : గంభీరమైన వాతావరణము – మహారాజు, మంత్రి ప్రవేశిస్తారు)

రాజు : పరమేశ్వరా! వర్షాలు లేక పంటలు పండక, దాహార్తిని బాపుకునే దిక్కులేక, నా దేశ ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మాకెందుకీ దురవస్థ? సర్వేశ్వరా కరుణించు. కటాక్షించు. వర్షాలు కురిపించు.

| | | |
|---|---|---|
| మంత్రి | : | మహారాజా! దిగులు పడకండి దేశదేశాల పండితులను పిలిపించాం. సదస్సులు నిర్వహించాం. దేశ పరిస్థితిని వివరించాం. వారు కూలంకుషంగా పరిశీలించి "మహేంద్ర జలయజ్ఞాన్ని" జరపాలని నిశ్చయించారు. ఎవ్వరైనా ఒక్క త్యాగమూర్తి ఈ మహేంద్ర జలయజ్ఞంలో ప్రాణ త్యాగం చేస్తేనే వర్షాలు కురుస్తాయని పండితులు సెలవిచ్చారు. వెంటనే దేశ ప్రజలందరికీ ఈ విషయాన్ని తెలియజేశాం. ఎవ్వరైనా ఒక త్యాగమూర్తి ప్రాణ త్యాగానికి సిద్ధపడి వస్తాడని ఎదురు చూస్తున్నాం. ఇంతవరకు ఎవ్వరూ రాలేదు మహారాజా! |
| రాజు | : | దేశ క్షేమం, ప్రజా సంక్షేమం కోసం ప్రాణాలర్పించేవారు ఒక్కరూ లేరా మనదేశంలో? |
| శతమన్యు | : | నేనున్నాను. |
| రాజు | : | పసిబాలుడివి ప్రాణం త్యాగం చేసేది నువ్వా? |
| శతమన్యు | : | మహారాజా! ప్రహ్లాదుడు, ధృవుడు కూడా పసివారే. వారు అపురూపమైన భక్తి ప్రపత్తులు ధైర్య సాహసాలు ప్రదర్శించలేదు? నాకనుజ్ఞను ఇప్పించండి. ప్రజా సంక్షేమం కోసం ప్రాణత్యాగం చేసే మహా భాగ్యం నాకు కల్పించండి. |
| మంత్రి | : | మీ తల్లిదండ్రుల అనుమతి తీసుకునే వచ్చావా? |
| తండ్రి | : | (ప్రవేశిస్తూ) నాయనా శతమన్యూ! |
| శతమన్యు | : | మహామంత్రీ! వారే నా తండ్రిగారు. |
| మంత్రి | : | కుమారుడి కోసం విచారిస్తున్నారా? |
| తండ్రి | : | మహామంత్రీ! తన త్యాగంతో మా కుటుంబానికి కీర్తి ప్రతిష్ఠలు ఆర్జిస్తున్న నా కుమారుణ్ణి ఆశీర్వదించడానికే వచ్చాను. |
| తల్లి | : | కుమారా శతమన్యూ! |
| రాజు | : | మీరెవరు? |
| తల్లి | : | శతమన్యుని తల్లిని. |
| రాజు | : | తల్లి మనసు కదా! విచారించకండి మీ కుమారుడి ప్రాణ త్యాగం ఇష్టం లేకపోతే మీ పుత్రుణ్ణి నిరభ్యంతరంగా తీసుకువెళ్ళండి. |
| తల్లి | : | మహారాజా! ఇవి అశ్రుధారలు కావు, ఆనందభాష్పాలు. పరుల సేవ కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడ్డ త్యాగమూర్తిని కన్నాను కదా! అని గర్విస్తున్నాను. |
| శతమన్యు | : | చూశారా మహారాజా! ఈ అదర్శమూర్తులు నా తల్లితండ్రులు. అనాథల్ని ఆదుకోవడానికి ఎన్నో త్యాగాలు చేసి సన్మార్గంలో నన్ను నడిపించారు.<br>(శతమన్యుడు ప్రాణత్యాగానికి సిద్ధపడతాడు)<br>మహారాజా! ఆ ఖడ్గాన్ని ఇవ్వండి (ఖడ్గం తీసుకుని మీదకు ఎత్తుతాడు)<br>ఓం నమఃశివాయ! ఓం నమఃశివాయ! ఓం నమఃశివాయ! |
| అశరీరవాణి | : | శతమన్యూ! ఆగు, నీ త్యాగం అపురూపం, నీ దేశభక్తి నిరుపమానం, నీ త్యాగం అనిర్వచనీయం. నీ త్యాగం నన్ను కదిలించింది. చిరంజీవిగా వర్ధిల్లు నాయనా! నేటి నుండి మీ దేశమంతటా కుంభవృష్టి కురుస్తుంది. దేశం సస్యశ్యామలమౌతుంది. "లోకాస్సమస్తా సుఖినో భవంతు" |
| రాజు | : | శతమన్య కుమారా! నిన్ను కన్న ఈ దేశం ధన్యమయింది నాయనా. |

(విరామ సంగీతం)

సుందరం : శతమన్యుని చరిత్ర వింటే మీకు కళ్లు చెమర్చడంలేదా? ఒళ్లు పులకరించడంలేదా? ఇలాంటి బిడ్డలను కన్న పుణ్యశీల మన భరతమాత. ఇలాంటి కథలు ఎప్పుడైనా విన్నారా? మీ బిడ్డలకు చెప్పారా?

రంగనాథం : లేదు. ఈ కథలు చదవడం అంత అవరం అంటారా?

సుందరం : ఈ కథలు చదివుంటే, కనీసం విని ఉంటే త్యాగం విలువ మీకు తెలిసేది. నీతిగా ఉండాలన్న ఉత్తేజం కలిగేది ఎంతటి ఉత్తమ సంస్కారానికి భారతదేశం పునాది వేసిందో మా బాబా మాటల్లో వినండి.

పద్యం : పరమపావనమైన భారతావని యందు
సహస మన్నది మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నెగాంచిన యట్టి
ఘన సత్యశీలమై కఠిన తపము
మధుర భావంబేది మన దేశం మందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశనీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశనీతులరసి
ఔర! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగ లేదో
అటులైనారు భారత ప్రజలు నేడు

రంగనాథం : ఇవన్నీ నాకు అర్థం కావులెండి. పోనీ మా సిబ్బందిపై అజమాయిషీ చేయగలరా?

సుందరం : అజమాయిషీ అంటే వారిని దండించి భయపించడమా? నేను చేయను.

రంగనాథం : దండించకపోతే వాళ్ళని అదుపులో వుంచగలమా?

సుందరం : ఉంచగలం. వాళ్ళ కష్టాలూ కన్నీళ్ళూ పంచుకుంటాను. వాళ్ళని ప్రేమిస్తాను. వాళ్ళతో చేయీ చేయీ కలిపి పనిచేస్తాను.

రంగనాథం : ప్రేమతో పని చేయించడమా! అసంభవం!

సుందరం : అని మీరనుకోవచ్చు. కాని మా బాబా చేసి చూపించారు. పది సంవత్సరాలు పట్టే ఆసుపత్రిని ఆరునెలల్లోనే నిర్మించారు. సంవ్సరాలు పట్టే నీటి పథకాన్ని ఏడు నెలల కాలంలో పూర్తి చేశారు. కారణం ఏమిటంటారు? వారి అమృత ప్రేమ. ఇది మన కళ్ళ ముందు, జరిగిన కథ. స్వామే కాదు వారి మాతృమూర్తి ఈశ్వరమ్మగారు ప్రదర్శించిన ఆదర్శం నాకు కనువిప్పు కలిగించింది.

రంగనాథం : బాబావారి మాతృమూర్తి అంత ఆదర్శమూర్తి అంటారా?

సుందరం : అవును రంగనాథంగారూ! ఆ జాలి గుండె గల తల్లి ఏం చేశారో తెలుసా?
(విరామ సంగీతం) (పర్తి మహిళల జానపద నృత్యం జరుగుతూ ఉంటుంది)

పాట

పల్లవి : నోమి నోమన్నలారా నోమన్నలారో సాయిరామా! సాయిరామా!
చల్లని సామివి నీవు చల్లగమము చూశావు సాయిరామా! సాయిరామా! ॥నోమి॥

చ.1 : శ్రీ విష్ణుమూర్తివి సాయిరామా! సాయిరామా!
నీవు శివశక్తిమూర్తివి సాయిరామా! సాయిరామా!
సత్యసాయిబాబాగా సాయిరామా!
నీవు అవతారమెత్తావు సాయిరామా! ॥నోమి॥

చ.2 : వెన్నవంటి మనసునీది సాయిరామా! సాయిరామా!
వెన్నెలంటి చూపు నీది సాయిరామా! సాయిరామా!
తేనెవంటి మాట నీది సాయిరామా!
ప్రేమ పంచి ఇచ్చినావు సాయిరామా!
మా బంగారు తండ్రి నీవు సాయిరామా! ॥నోమి॥

రామయ్య : అమ్మా! ఈశ్వరమ్మగారూ! పర్తి ప్రజలు ఎంత ఆనందంగా స్వామిని కీర్తిస్తున్నారో చూశారా! ఆ ఆందానికి కారణం మీరేనమ్మా. మీ కోసం ఏమీ కోరుకోకుండా, మా కోసం ఆసుపత్రిని నిర్మించమన్నారు.

ఈశ్వరమ్మ : అంతా స్వామి దయ రామయ్యా! స్వామీ సరైన వైద్యం లేక పుట్టపర్తి వాసులంతా ఎంతో ఇబ్బంది పడుతున్నారు అని ఒక్కమాట చెప్పానా స్వామి మనస్సు వెన్న పూస కదా! కరిగిపోయింది. ఇదిగో! ఈ ఆసుపత్రి నిర్మిస్తున్నారు
(అని రాయి అందుకుని నెత్తిమీద పెట్టుకుంటారు)

రామయ్య : అమ్మా! రాళ్ళు మీరు మొయ్యడమేమిటి? ఆ రాయి ఇలా ఇవ్వండి. నేను మోస్తాను.

ఈశ్వరమ్మ : భగవంతుడే స్వయంగా కావడి కుండలతో నీళ్ళు మోసి ప్రజల దాహం తీర్చాడయ్యా! ఆ భగవంతుడి తల్లిని, నేను సేవ చేసి ఆదర్శంగా ఉండొద్దా నాయనా!

రామయ్య : ఎంత గొప్పమాట తల్లీ! మీ పాదాలకు నమస్కరిస్తే చాలు మా జన్మ ధన్యమవుతుంది.

ఈశ్వరమ్మ : రామయ్యా! నీకు తెలీదేమో! పేదల ఆకలి బాధ చూడలేక, తనకు పెట్టిన భోజనాన్ని కూడా వారికి ప్రేమతో అందించేవాడయ్యా స్వామి. ఆ త్యాగమూర్తికి తల్లిని, ఆ జాలి గుండెల స్వామికి అమ్మను, నేను ఆదర్శంగా ఉండొద్దా మరి?

రామయ్య : ఐతే మీరూ మాలాగే కష్టాలు అనుభవించాలా అమ్మా!

ఈశ్వరమ్మ : కష్టాలే మనని భగవంతునికి దగ్గర చేస్తాయి రామయ్యా. పాండవులు కష్టాలను ఆహ్వానించబట్టే కదా? ఆ కృష్ణ పరమాత్మకు దగ్గరయ్యాను. నేను కష్టాలు అనుభవించకపోతే "అమ్మా మా కష్టాలు స్వామికి చెప్పండి అని అడిగేవారికి, కష్టాలు

చిరునవ్వుతో ఎదుర్కోవాలి, అవి కదిలే మేఘాలు, వాటి వెనువెంటనే సుఖం వుంటుంది అని సలహాలిచ్చే అధికారం నాకుంటుందా రామయ్యా! స్వామి నాకు ఎంతో ప్రేమతో చెప్పే పాఠాలు ఇవే. నేను సేవ చేసే స్వామికి దగ్గరవుతాను రామయ్యా.

(విరామ సంగీతం)

సుందరం : ఇప్పుడు చెప్పండి. భగవాన్ బాబాను భగవంతుడని కొలుస్తూ, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గురించి స్వామి ప్రభోదాలను వింటూ, వారి దివ్య దర్శనం చేసుకుంటూ ఉద్యోగం, వ్యాపారాల్లో నీతి నియమాలను పాటించకపోతే, స్వామి అనుగ్రహాన్ని సంపాదించే అర్హత ఉంటుందా నాకు?

రంగనాధం : నిజమే ఉండదు.

సుందరం : తనను ద్వేషించే వారిని కూడా ప్రేమించే దైవం మా బాబా. తన బోధనలను స్వయంగా ఆచరించి చూపిస్తున్నారు. వారిని ఆరాధిస్తూ వారి బోధనలలో కనీసం ఒక్కటైనా ఆచరించాలి కదా! మా బాబా ఎలాంటి ప్రపంచాన్ని సృష్టిస్తున్నారో తెలుసా? ఆ ప్రపంచంలో పేదా, గొప్పా తేడాలుండవు. కలతలూ, కలహాలూ అసలే వుండవు, ద్వేషం, మోసం, మచ్చుకైనా కనిపించవు. అదొక దివ్య ప్రపంచం.

పాట :

పల్లవి : సాయిరాం సాయిరాం సాయిరాం సాయిరాం
సాయీ సాయీయని కలిసి పాడుదాం ॥సాయి॥

చ. 1 : మాతృభావన చేసి మగువలను మన్నిస్తాం
తల్లీదండ్రులను మేము దైవాలుగా సేవిస్తాం
మధురమైన మాటలతో చిరునవ్వులు కురిపిస్తాం
మనసూ మాటా చేతా ఒకటేనని చూపిస్తాం
పేదా గొప్పా తేడా లేని ప్రపంచం ఇది సాయి ప్రపంచం

చ. 2 : కోపాలకు తావులేని నవ జగతిని నిర్మిస్తాం
కలతలు కలహాలు మరచి అందరినీ ప్రేమిస్తాం
దీనుల వదనాలలో మాసాయిని దర్శిస్తాం
సాయి ప్రేమవాహినిలో అనుక్షణమూ జీవిస్తాం
ద్వేషం మోసం లేని దివ్య ప్రపంచం ఇది సాయి ప్రపంచం
ప్రేమ ఇచ్చి పుచ్చుకునే సాయి ప్రపంచం సత్యసాయి ప్రపంచం ॥సాయి॥

రంగనాధం : అయితే మీ మాటలకే కట్టుబడి ఉంటారన్నమాట! నీతి నియమాలకే పట్టం కడతారన్నమాట! మరి ఈ రోజుల్లో మీలాంటి వారికి ఉద్యోగం ఎవరైనా ఇస్తారనే అనుకుంటున్నారా?

సుందరం : అంటే ఇంతవరకూ ఉద్యోగం కోసం, సంపాదన కోసం ఇంకొకరి దయా దాక్షిణ్యాల

మీద ఆధారపడ్డాననుకుంటున్నారా? చూడండి రంగనాధంగారూ! స్వామి దర్శనమే నాకు సుదర్శనం. సాయి నామస్మరణే నా వజ్రాయుధం. సాయి మాటే నాకు రాచబాట. అన్నింటినీ మించి సాయీ అంటే ఓయీ! అని పలికే స్వామి నా పెన్నిధి, ఇన్ని నిధులు నాకున్నాయి. నాకసాధ్యం లేదు. రాదు. నా స్వశక్తితో పదిమందికి ఉపాధి కల్పించే సంస్థను నేను స్థాపిస్తాను. నేనుండగా భయమెందుకని అండగా నిలబడే స్వామి ఉండగా నాకన్నా భాగ్యవంతుడెవరండీ? ఈలోకంలో నాకేలోటు రాదు. మీరు విచారించకండి. మీకూ, మీ ఉద్యోగానికీ ఒక నమస్కారం.

రంగనాధం : కాని నేను నీకే ఉద్యోగం ఇస్తున్నాను సుందరం. నువ్వే నా కంపెనీకి ప్రాజెక్టు మేనేజర్‌వి. ప్రపంచం తలక్రిందులైనా నీతి తప్పని పట్టుదల గల వ్యక్తి కోసం నేను గాలిస్తున్నాను. ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబాని దర్శించిన తర్వాత నాకు కావలసిన వ్యక్తి సత్యసాయి సేవకుల్లో లభ్యమవుతారని నమ్మకం కలిగింది. నేను పెట్టిన పరీక్షల్లో నువ్వు నెగ్గావు. నిన్నూ, నీ ప్రతిభనీ, ప్రత్యక్షంగా చూశాను. నీతి నియమాలు జీవంగా భావించే నీలాంటి వజ్రాలను ఈ జగత్తుకు ప్రసాదిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి పాదపద్మాలకు నమస్కారములు.

--0 0 0--